REGD. NO. 40A        విడిప్రతి 0-2-0        6-4-56 శుక్రవారం

# జమీన్‌రైతు

సంపుటి 28 ⁑ మేనేజింగుఎడిటర్ : నెల్లూరు వెంకట్రామానాయుడు :: సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ⁑ సంచిక 14

# ఆంధ్రలో తిరుగా ఎన్నికలు జరిపించప్రయత్నం

## తెలంగాణావారిసూచనకు, ఒక ఆంధ్రనాయకుని బలంకూడా వున్నదా?

### ఆంధ్రభావ తరంగాలు

ఆంధ్ర – తెలంగాణా విలీనీకరణలో, వివాదంగావున్న సమస్యల పరిష్కారానికి, తెలంగాణా నాయకులు యీవారంలో కర్నూలువచ్చి సంప్రతింపులు జరిపారు. ముందేమో అన్నివిషయాల్లో ఏకీభావం కుదిరిందన్నారు. కాని తర్వాత వచ్చిన వార్తలను చూస్తే, అన్నిటిల్లో అభిప్రాయ భేదాలు అట్లనే మిగిలాయని అర్థంచేసుకోవలసి వస్తున్నది.

ఇరు ప్రాంతాల నాయకులమధ్య జరిగిన సంప్రతింపుల్లో, రాష్ట్రంపేరుకొనటి, 'ఆంధ్ర-తెలంగాణ' అనే అతుకులబొంత పేరు బదులు, 'ఆంధ్రప్రదేశ్' అని పెడితే బాగుంటుందని ఆంధ్రనాయకులు సూచించారు. కొంతమీద బడి తెలంగాణా నాయకులు దీనికి సమ్మతించారట. కాని "ప్రతిష్ఠ" కోసం దాన్ని గూర్చి ఆలోచిస్తామన్నారట. హైదరాబాద్ చేరినవెనుక యీ పేరుకు వారు తమ సమ్మతిని తెల్పగలరని తెలుస్తున్నది.

ఆంధ్రశాసనసభ పదవీకాలం 1962 వరకు పొడిగించాలనే ప్రతిపాదనకు, తెలంగాణా నాయకులు ఆక్షేపణ తెల్పినట్లులేదు.

క్రొత్త రాష్ట్రానికి లెజిస్లేటివ్ కౌన్సిల్ వుండాలనేదానికి యిరువురి సమ్మతి వివాదం లేకుండా లభించినట్లున్నది.

హైకోర్టు విషయంలో ఆంధ్ర నాయకుల సూచనకు తెలంగాణా వారు సమ్మతించినది లేనిది స్పష్టంగా తెలియలేదు. డివిజన్ బెంచీ ప్రసక్తి లేకుండా, హైదరాబాదులోనే హైకోర్టు వుండాలనే దానికి తెలంగాణా నాయకులు అంగీకరించారని తొలివార్త. తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ నరసింగరావుగారి ప్రకటనకూడా ఆ దే సూచించింది. కాని చివరన వచ్చిన వార్తవల్ల ఆ విషయం పరిష్కారమైనట్లు కనబడదు.

మైసూరు, ఒరిస్సా, మద్రాసు మున్నగు రాష్ట్రాలతోవున్న సరిహద్దు తగాదాల పరిష్కారానికి, సరిహద్దు సంఘాన్ని నియమించాలనే తీర్మానాన్ని ఆమోదించారు.

నరసింహారావుగారి ప్రకటనబట్టి, తెలంగాణా రాష్ట్రకాంగ్రెస్ సంఘం 1962 వరకు ప్రత్యేకంగా వుండుటకు ఆంధ్రనాయకులు సమ్మతించారట. ఇది ఎంతవరకు యథార్థమో స్పష్టపడలేదు. నరసింగరావుగారు యీ మాట పత్రికలవారికి చెప్పినప్పుడు, ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షులు సత్యనారాయణరాజుగారుగూడా ప్రక్కనేవుండి దానిని కాదన లేదు. అది యథార్థమేనని నమ్మవలసి వుంటుందేమో!

వివాదంగావున్న సమస్యలుయివి. వాటి పరిష్కార వ్యూహంగూడా పైనవివరించాము. ఆంధ్రశాసనసభలో ముఖ్యమంత్రిగారుగా ప్రవేశపెట్టిన పైసవరణలు ప్రతిపాదించడంవల్ల, వాటిని తెలంగాణా నాయకులు అంగీకరించగలరనే విశ్వాసముండబట్టే, గోపాలరెడ్డిగారు వాటిని ప్రవేశపెట్టారని అనుకోవలసి వస్తుందేమో!

❋

## ఎన్నికలు జరిగితే వ్యతిరేకుల బలం తగ్గుతుందని వూహ?

గోపాలరెడ్డిగారు శాసనసభలో ప్రవేశపెట్టిన సవరణలలో అందరికి ఆశ్చర్యాన్ని కల్గించింది 'క్రొత్తరాష్ట్రం' అన్న పదం. ఈ పదాన్ని చేర్చడంలో వెనుక ఏదోకథ వున్నట్లు రాజకీయజ్ఞులు అనుమానిస్తున్నారు.

ఆంధ్రరాష్ట్రంలో తెలంగాణా చేరుతున్నది. ఇది రాష్ట్రాల పునర్విభజనబిల్లు ప్రకారం స్పష్టమైనవిషయం. దాని విస్తీర్ణం, జనాభా, ప్రతిపత్తి యీ చేరడంతో అవసరంలేదు. ఆంధ్రలో లీనమైపోతాం అనేమాట తెలంగాణా నాయకులకు అవమానకరంగా వున్నట్లు తోస్తున్నది. అందువల్లనే ఆ పదానికి వారు ఆక్షేపించారు. హైదరాబాద్ విభాగమై, అందులో ఒకముక్క అయిన తాము ఆంధ్రలో చేరినందువల్ల అది క్రొత్త రాష్ట్రం కావాలని తెలంగాణానాయకుల వాదం. అంతరంగికంగా ఏదో ఒక కుట్ర లేకుంటే, యీ మాటవల్ల వారి ప్రతిపత్తికి కలిగే భంగమేమిటి?

తెలంగాణా ఆంధ్రలో చేరినందువల్ల క్రొత్తగా నాయకత్వ ఎన్నిక రాకపోవచ్చునని, క్రొత్తగా అసెంబ్లీ స్పీకరును ఎన్నుకునే అవసరంగూడా లేకుండా పోవచ్చునని కర్నూలు రాజకీయవర్గాలలో వినిపించింది. అలాంటప్పుడు గోపాలరెడ్డిగారే క్రొత్తశాసనసభలోగూడా కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కావలసివుంటుంది. ముఖ్యమంత్రి వారే కావాలె. స్పీకరు దొరగారేవుంటారు. తమవారు వుండే అవకాశం లేకుండాపోతుంది. అందువల్ల, ఏర్పడబోయేది క్రొత్తరాష్ట్రమంటె యీ చిక్కులన్ని వుండవు. తెలంగాణానాయకులు యీవిషయంలో పట్టుపట్టడానికి యిదే కారణమని కర్నూలు రాజకీయవర్గాలలో వినిపిస్తున్నది.

కాని, యీ 'క్రొత్తరాష్ట్రం' సవరణ వెనుక ఒక ఆంధ్రనాయకుని అదృశ్యహస్తం గూడా వున్నదని రాజకీయ పరిశీలకులంటున్నారు.

1957 లో తెలంగాణాతోపాటు ఆంధ్ర రాష్ట్రంలోగూడా ఎన్నికలు తీసుకరావడమే యీ సవరణ సూచించడంలో అంతర్యమని రాజకీయ పరిశీలకుల భావన. తెలంగాణాతోపాటు యిక్కడా ఎన్నికలు జరిగినపుడు, తనతో సరితూగుతుండే మరొకవర్గం బలం తగ్గు

—కొరవ 4 వ పేజీలో



నెల్లూరు వ్యవసాయ ప్రదర్శనాన్ని ప్రారంభిస్తున్న రివిన్యూమంత్రి శ్రీ కల్లూరు చంద్రమౌళిగారు

≋ డర్బి లాటరీ టిక్కెట్లు ≋

మీ అదృష్టమును ఆహ్వానింపుడు

మొదటి బహుమతి రూ 700000/- లు

యీ నెలలో జరుగబోవు డర్బి ముగింపు తేది 5—5—56

డా — — 2—6—56

రేసు — — 6—6—56

1953 నుంచి యిప్పటివరకు మావద్ద టిక్కెట్లు కొన్నవారిలో కొందరు కొన్నిటిల రూపాయలు బహుమతులు పొందిరి. టిక్కెట్లు అమ్మకమునకు సిద్ధముగా నున్నవి.

—— టిక్కెట్లు కావలసినవారు ——

కోకా గోవిందరావు అండ్ సన్సు

(ఏజంట్లు:- ది డర్బి, ఐరిష్ హాస్పిటల్సు స్వీప్‌స్టేక్ వగైరా వాండ్లు)

సంతపేట — నెల్లూరు

టెలిగ్రాం :: లక్ష్మీస్వీప్.

